వైన్‌షాపువద్ద గొడవ

పరస్పరం దాడులు

బంజారాహిల్స్,మే 26: మద్యం మత్తులో పరస్పరం దాడులు చేసుకున్న ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నందినగర్‌కు చెందిన మద్దంగుల కృష్ణ అనే యువకుడు శనివారం రాత్రి బంజారాహిల్స్ రోడ్ నెం10లోని గౌరీశంకర్ వైన్స్‌వద్ద మద్యం సేవించేందుకు వచ్చాడు. రాత్రి 11.10 తర్వాత షాపువద్దనుంచి బయటకు వస్తున్న క్రమంలో అక్కడున్న జహీరానగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ కరీమ్ ఇక్కడ ఎందుకున్నావంటూ ప్రశ్నించాడు. దీంతో కృష్ణకు అక్కడున్న వారికి మధ్యన గొడవ ప్రారంభమైంది. మాటామాటా పెరగడంతో కరీమ్‌తో పాటు మరికొంత మంది వ్యక్తులు కృష్ణపై దాడికి పాల్పడ్డారు.వారిలో ఒకరు బీర్‌బాటిల్‌తో కొట్టడంతో రక్తస్రావం అయింది. దీంతో ఆగ్రహానికి లోనయిన కృష్ణ రాడ్‌తో కరీమ్‌పై దాడి చేశాడు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని వైద్య పరీక్షలకు అనంతరం అదుపులోకి తీసుకున్నారు. పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడంతో ఇరువర్గాలపై వేర్వేరు కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విశ్వకర్మ లెజెండరీ అవార్డ్స్ ప్రదానోత్సవం

చిక్కడపల్లి, మే 26: విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ 8వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్ర బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సెంటర్ అధ్యక్షుడు విశ్వనాదుల పుష్పగిరి ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న విశ్వకర్మ ప్రముఖులకు విశ్వకర్మ లెజండరీ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీఠాదీశ్వర్లు జగద్గురు శ్రీ కాతేంద్రస్వామి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి హాజరై అవార్డును ప్రదానం చేశారు. సమాజ హితం కోసం సేవచేసే వారిని గుర్తించి అవార్డులతో సత్కరించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా దొంచనాల శ్రీనివాస్‌కు జీవన సాఫల్య పురస్కారం అందజేశారు.

యూనిఫాం స్టిచింగ్‌పై అవగాహన

మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తున్న యూసీడీ డీపీవో వెంకటకిషన్‌రావు

జూబ్లీహిల్స్,మే26: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల స్కూల్ యూనిఫాం స్టిచింగ్‌పై పొదుపు మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తున్నారు. జూన్ 12 న పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు విద్యార్థులకు ఏకరూప దుస్తులు సిద్ధం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వారం రోజుల ముందే యూనిఫాం సిద్ధం చేసి సర్కార్ బడులు తెరిచిన మొదటిరోజే యూనిఫాం అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జీహెచ్ఎంసీ యూసుఫ్‌గూడ సర్కిల్ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో 33 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో 8,750 మంది విద్యార్థులకు 16 స్లమ్ లెవల్ ఫెడరేషన్‌ల పొదుపు సంఘాల మహిళలు స్కూల్ యూనిఫాంలు సిద్ధం చేసే పనులను చేపడుతున్నారు. ఈ మేరకు ఆదివారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో పొదుపు మహిళా సంఘాలకు యూసీడీ డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటకిషన్‌రావు, టెక్నికల్ సిబ్బందితో కలిసి స్కూల్ యూనిఫాం స్టిచింగ్ పనులపై అవగాహన కల్పించారు. ఇప్పటికే ఆయా సంఘాలకు క్లాత్‌ను పంపిణీ చేసిన అధికారులు ఏకరూప దుస్తులను త్వరితగతిన సిద్ధం చేయాలని సూచించారు. టౌన్ లెవల్ ఫెడరేషన్ పరిధిలోని స్లమ్ లెవల్ ఫెడరేషన్ పొదుపు సంఘాల మహిళలు పాఠశాలల ప్రారంభానికి వారం ముందే స్కూల్ యూనిఫాంలు సిద్ధం చేసి ఉంచుకోవాలని సూచించారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి

హిమాయత్‌నగర్,మే26: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశం డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్‌నగర్ లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే కార్మికులు చాలీచాలనీ వేతనాలు తీసుకుంటూ అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ,ఈపీఎఫ్ వంటి సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. పదేండ్ల కాలంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతతత్వ విధానాలతో రాజకీయం చేసిందే తప్ప కార్మికుల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. కార్మికులు సంఘటితమై హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపు నిచ్చారు.

మధుమేహంపై అవగాహన కలిగి ఉండాలి

డయాబెటిస్ ఎక్స్‌పో -2024 ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ చీఫ్ జస్టిస్ ఎన్‌వీ రమణ, తదితరులు

కొండాపూర్, మే 26: మధుమేహంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి దరిచేరకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు వచ్చాక పాటించాల్సిన నియమాలపై ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ అన్నారు. ఆదివారం డాక్టర్ మోహన్స్ డయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్ ఆధ్వర్యంలో ఫిల్మ్‌నగర్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన డయాబెటిస్ ఎక్స్‌పో-2024కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధుమేహం వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తుందని, దేశంతోపాటు హైదరాబాద్ నగరంలో వ్యాధి తీవ్రత పెరుగుతుందన్నారు. యువత, చిన్న పిల్లలు సైతం మధుమేహం వ్యాధికి గురవుతున్నారని, మారుతున్న జీవన విధానాలు, ఆహారపు అలవాట్లు ప్రధాన కారణంగా మారుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ చైర్మన్ డాక్టర్ కే సతీశ్‌రెడ్డి, ప్రొఫెసర్ బీకే సహాయ్, డాక్టర్ వీ మోహన్, డాక్టర్ ఆర్ఎం అంజన తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

మహాత్మానగర్‌లో శ్రీ సత్యసాయి బాబా ట్రస్ట్ గాంధీనగర్ బ్రాంచి ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పేదలకు ప్రతి నెలా 5 కేజీల బియ్యంతో పాటు అన్ని నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని ట్రస్ట్ ప్రతినిధులు రామన్, ఏఎస్ రాజు, మధుసూదన్, నర్సింహ, ఎంఎల్ఎన్ స్వామి, బిజ్జి కనకేశ్ కుమార్ తెలిపారు.

– కవాడిగూడ, మే 26

వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మైలార్‌దేవ్‌పల్లి, మే 26: వేంకటేశ్వర స్వామి నామస్మరణతో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టీఎన్‌జీవోస్ కాలనీ మార్మోగింది. శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ సాలాగ్రమ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి దేవాలయ 7వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాలు ఐదు రోజుల పాటు సాగుతాయని దేవాలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు కలగకుండా భారీ ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. తెల్లవారుజాము నుంచే దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవం సందర్భంగా దేవాలయాలన్నీ వివిధ రకాల పూలు, విద్యుత్ కాంతులతో అందంగా ముస్తాబు చేశారు. ఆదివారం ఉదయం ఆరాధన, పేవకాలం, గోష్ఠి, బాల భోగం, ఉత్సవారభ స్నపనం, ఉత్సవానుజ్ఞ, విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవచనం, రక్షాబంధనం, బుత్విక్కరణం, మధ్యాహ్నిక ఆరాధనగోష్ఠి, సాత్తుమరై, సాయంత్రం ఆరాధన, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్యంగ్రహణం, అంకురారోపణ ద్వారా తోరణ ధ్వజ కుంభారాధన, వాస్తుపూజ, గరుఢాధివాసం ఆవిష్కరణ, ఆరగింపు శాత్తుమరై తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శంషాబాద్ రూరల్, మే 26 : శంషాబాద్ పట్టణంలో సోమవారం కరెంట్ కోతలు విధిస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ షేక్ బాషా ఆదివారం తెలిపారు. శంషాబాద్ పట్టణంలోని ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆర్బీనగర్, మిషన్ కౌంపౌండ్, హుడా కాలనీ, సంపత్‌నగర్, కేఎల్‌సీసీ తదితర ప్రాంతాల్లో, 2 గంటల నుంచి సాయంత్రం 4 వరకు శంషాబాద్ పట్టణంలోని మధురానగర్,ఆదర్శనగర్, శ్రీనివాసకాలనీ,రిజిస్ట్రేషన్ కార్యాలయం, రాళ్లగూడ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

శంషాబాద్ మండలంలోని పెద్దషాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి మాధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ముచ్చింతల్, శంకరాపూర్, పెద్దషాపూర్, అలీకోల్‌తండా,మదన్‌పల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి విద్యుత్ లైన్లలో ఉన్న సమస్యలను పరిష్కారం చేస్తామని ప్రజలు విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని పెద్దషాపూర్ సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు.

మైలార్‌దేవ్‌పల్లిలో...

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు ఏఈ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి, బృందావన్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు మొగల్ కాలనీ, మైలార్‌దేవ్‌పల్లి గ్రామం, లాల్‌బహదూర్‌నగర్, ప్రగతి కాలనీ, బృందావన్ కాలనీ, టాటానగర్, పల్లెచెరువు, బండ్లగూడ, రిగల్ గార్డెన్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు పల్లెచెరువు ఇండస్ట్రీయల్ ఏరియా, తమిల్ బస్తీ, ఆలీనగర్, వీకర్‌సెక్షన్ కాలనీ, వినాయన్‌నగర్, హరిజన బస్తీ, పల్లెచెరువు, ఎంఎం కాలనీ, ప్యాలెస్ వ్యూ కాలనీ, అమోల్ గార్డెన్, అహ్మద్ నగర్, ఇండస్ట్రీయల్ కాలనీ తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

కాటేదాన్ సబ్‌స్టేషన్ పరిధిలో...

కాటేదాన్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు అధికారుల ఒక ప్రకటనలో తెలిపారు. బీకే పురం, నవశక్తి ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు రోషన్‌కాలనీ, షామా కాలనీ, బీకే పురం, అక్బర్ కాలనీ, సైఫా కాలనీ, జైయిన్ కాలనీ, అదిలాషా కాలనీ తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు పురస్కారాలు

మాట్లాడుతున్న వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంగం రాష్ట్ర అధ్యక్షుడు సంగమేశ్వర్

ఖైరతాబాద్, మే 26 : పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంగం రాష్ట్ర యువజన విభాగం ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేయనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని పదిలో 9.0 జీపీఏ నుంచి 10జీపీఏ, ప్రైవేట్ పాఠశాలలో చదువుకొని 9.2, 10 జీపీఏ పొందిన వీరశైవ లింగాయత్ లింగ బలిజ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందించి సన్మానించనున్నట్లు తెలిపారు. జూన్ 9న బిర్లా ఆడిటోరియంలో నిర్వహించే ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు rvllbsssc2 024@gmail.com, 9550445747 నంబరుకు వివరాలు పంపించాలని కోరారు. డాక్టర్ శివప్ప, శెట్టి శివ, శివకుమార్, శివచరణ్, రాచప్ప, సూర్యశ్రావణి పాల్గొన్నారు.

ఆనందాపోయిట్రీ అపార్ట్‌మెంట్ కార్యవర్గం ఎన్నిక

నూతన కార్యవర్గ సభ్యులతో అధ్యక్షుడు నీలేశ్‌ప్రసాద్ దూబే

మణికొండ, మే 26 : నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఆనందాపోయిట్రీ అపార్ట్‌మెంటు సంక్షేమ సంఘ పాలకవర్గ నూతన అధ్యక్షుడిగా నీలేశ్‌ప్రసాద్ దూబే ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం అపార్ట్‌మెంటులో నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పురుషోత్తం,సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా సత్యనంద, యోగేశ్‌ప్రసాద్ దూబే, కోశాధికారిగా రవీందర్, సహ కోశాధికారిగా కోటేశ్వరరావు, సలహాదారులుగా మహ్మద్ ఆయుబ్, సూర్యతేజ, రంజిత్ కుమార్, సత్యనారాయణ, ప్రదీప్ పట్నాయక్ ఎన్నికయ్యారని నీలేశ్ ప్రసాద్ దూబే వెల్లడించారు. ఈ పాలకవర్గం రెండేళ్ల పాటు అపార్ట్‌మెంటు నివాసితుల సంక్షేమాభివృద్ధి కోసం పనిచేస్తారన్నారు. తమపై అపార్టుమెంటు వాసులు పూర్తిస్థాయి విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆనందాపోయిట్రీ అపార్టుమెంటులో ఎలాంటి సమస్యలున్నా పాలకవర్గ సభ్యులందరిని కలుపుకుని ముందుకు పోతామని నీలేశ్‌ప్రసాద్ దూబే తెలిపారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

మణికొండ, మే 26: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని మణికొండ మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. వీఆర్4యూ గ్రూప్ ఆధ్వర్యంలో మణికొండ స్వర్ణ దేవాలయం సమీపంలో మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి గ్రూప్ ప్రెసిడెంట్ బాపూజీ, సెక్రటరీ డి.ఎస్.ఆర్.దాస్‌లతో కలిసి ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వాతావరణంలో కొనసాగుతున్న వేడిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. వీఆర్4యూ గ్రూప్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. తమవంతు సహాయ సహకారాలు గ్రూప్‌కు ఎల్లప్పుడు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సభ్యులు ప్రదీప్‌రావు, సాంబశివరావు, రామసుబ్బయ్య, నాగేంద్రరావు, రంగాచారి, నాగభూషణం, కన్నయ్య, ప్రభావతి, మంజు అగర్వాల్, లక్ష్మణ్, కాంతారావు, నాయుడు, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి

రావి నారాయణరెడ్డి చిత్ర పటానికి నివాళులర్పించిన కళా జనార్దన మూర్తి

ముషీరాబాద్, మే 26: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా ఆదివారం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మవిభూషణ్ రావి నారాయణరెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి పాల్గొని రావి నారాయణరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్రపోషించిన రావి నారాయణరెడ్డి ఎందరికో ఆదర్శంగా నిలిచిన గొప్ప సాయుధ పోరాట యోధుడని కొనియాడారు. నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య వ్యవస్థను అంతమొందించడానికి అలుపెరుగని పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయనీ ఆమని, నైషధం సత్యనారాయణమూర్తి, తోట శ్రీలక్ష్మి, తాళ్లపల్లి చక్రపాణి పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

బన్సీలాల్‌పేట్, మే 26: పద్మారావు నగర్‌కు చెందిన స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరాశ్రయులకు అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రోడ్ల పక్కన ఉంటూ ఆకలితో అలమటించే వృద్ధులను, నిరాశ్రయులను, దివ్యాంగులను ఆప్యాయంగా పలకరించి వారికి భోజనం సమకూర్చామని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని తెలిపారు.

జూన్ 1 నుంచి బడిబాట

- 12 న పాఠశాలలు ప్రారంభం
- రెండు జతల యూనిఫాంలు, ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ

జూబ్లీహిల్స్,మే26: నూతన విద్యాసంవత్సరం (2024-25) లో జూన్ 1 నుంచి 11 వరకు బడిబాట కార్యక్రమం చేపట్టనున్నారు. జూన్ 12 న పాఠశాలలు ప్రారంభంకానుండగా 2025 ఫిబ్రవరి 23 వ తేదీతో విద్యా సంవత్సరం ముగియనుంది. తెలంగాణలో శనివారం విద్యా క్యాలెండర్ విడుదల చేయడంతో పాఠశాలల సందడి మొదలుకానుంది. జూన్ 1 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు బస్తీలలో బడిబాట కార్యక్రమం చేపట్టనున్నారు. పేద విద్యార్థులకు విధిగా విద్యావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలపై విద్యాశాఖ అధికారులు విస్తృత ప్రచారం చేపట్టనున్నారు. ఉపాధి పనుల కోసం నగరానికి వచ్చి తమ పిల్లలను తమకు చేయూతగా పనులకు తీసుకెళ్లడం.. ఇంటి పనులు చక్కబెట్టేందుకు బడికి పంపకుండా ఇంటివద్దే ఉంచే తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతను వివరించి బడీడు పిల్లలు బడుల్లోనే ఉండేలా ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. కొంతమంది పిల్లలే ఆదాయ మార్గాలుగా పనులకు పంపే తల్లిదండ్రులకు నయానా.. భయానా నచ్చచెప్పి వారి పిల్లలను బడుల్లో చేర్పించనున్నారు. అమ్మాయిలను బయటకు పంపకుండా బడులు మాన్పించే తల్లిదండ్రులను గుర్తించి ప్రభుత్వం కల్పిస్తున్న బడీడు పిల్లలకు షీ టీమ్స్‌తో పాటు మహిళా శిశు సంరక్షణ శాఖ ద్వారా కల్పిస్తున్న భద్రతపై భరోసా కల్పించనున్నారు. అత్యధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ స్కూల్స్ వద్దు.. అన్ని ఉచితంగా అందిస్తూ నాణ్యమైన విద్య నందించే ప్రభుత్వ పాఠశాలలే ముద్దు అని.. అధికారులు బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన ఉచిత విద్య, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, 2 జతల యూనిఫాం, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ తదితర సౌలత్‌లపై తల్లిదండ్రులలో విస్తృత అవగాహన కల్పించనున్నారు. ఇప్పటికే గత తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ విప్లవాత్మక మార్పులతో ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ ఆంగ్ల మాధ్యమంలోకి మార్చిన విషయం తెలిసిందే. దీంతోపాటు ప్రొఫెసర్ జయశంకర్ బండిబాట కార్యక్రమంతో నాణ్యమైన విద్య నందిస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో పేద సామాన్య వర్గాల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

బంజారాహిల్స్,మే 26 అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ డిప్రెషన్ కారణంగా ఆత్మహత్యకు పాల్పడింది. గజ్వేల్ మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల కృష్ణ, పద్మ(33)దంపతులు ముగ్గురు పిల్లలతో కలిసి బంజారాహిల్స్ రోడ్ నెం నెం 12లోని శ్రీరాంనగర్‌లో నివాసం ఉంటారు. కృష్ణ జీహెచ్ఎంసీలో డ్రైవర్‌గా పనిచేస్తుండగా పద్మ గృహిణి. కొన్నేళ్లుగా పద్మకు గర్భసంచికి సంబంధించి సమస్యలు ఉన్నాయి. ఎన్నిసార్లు ఆస్పత్రులకు వెళ్లినా సమస్య తగ్గడం లేదని, తన అనారోగ్యంతో కుటుంబం మొత్తం బాధపపడాల్సి వస్తోందంటూ కొంత కాలంగా తీవ్ర మనోవేదనతో బాధపడుతున్న పద్మ శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన భర్త కృష్ణ తలుపులు పగలగొట్టి లోనికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతున్న భార్యకనిపించింది. దాంతో వెంటనే ఆమెను కిందకు దింపి మాసాబ్‌ట్యాంక్‌లోని మహావీర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు మృతురాలి సోదరుడు రాము బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డబ్బులు ఇవ్వాలంటూ ఆటో డ్రైవర్‌పై దాడి

బంజారాహిల్స్,మే 26: అర్ధరాత్రి వేళ పనిముగించుకుని ఇంటికి వెళ్తున్న వ్యక్తిని అటకాయించి డబ్బులు ఇవ్వాలంటూ బెదిరించడంతో పాటు దాడికి పాల్పడిన పాతనేరస్తుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నెం 5లోని దేవరకొండబస్తీకి చెందిన నవీన్ అనే ఆటో డ్రైవర్ ఈనెల 24న అర్ధరాత్రి దాటిన తర్వాత పని ముగించుకుని ఇంటికి వస్తున్నాడు. బస్తీకి చేరుకోగానే స్థానికంగా నివాసం ఉంటున్న సాగర్ అలియాస్ పప్పీ అనే యువకుడు ఆటోను అడ్డగించాడు. డబ్బులు ఇవ్వాలంటూ నవీన్‌ను డిమాండ్ చేయగా తనవద్ద లేవని సమాధానం ఇచ్చాడు. దీంతో ఆగ్రహానికి గురయిన సాగర్ చేతికి ఉన్న ఐరన్ కడియంతో నవీన్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో తలకు,ముఖానికి బలమైన గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితుడి సోదరుడు విశ్వనాథ్ శనివారం రాత్రి ఫిర్యాదు చేయగా ఐపీసీ 394 సెక్షన్ కింద సాగర్ మీద కేసు నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గతంలో సాగర్‌పై పంజాగుట్ట,బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నాలుగు చోరీ కేసులు ఉన్నాయని విచారణలో తేలింది.

హామీలు అమలు చేయాలి

శంషాబాద్ రూరల్, మే 26 : ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ శంషాబాద్ మండల మీడియా సెల్ కన్వీనర్ శ్రీధర్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కేవలం ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అమలు చేసి మహిళల మధ్య గొడవలు పెట్టారని తెలిపారు. మహిళలకు ప్రతి నెలా రూ.2500 ఇస్తామన్న సీఎం ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం గత బీఆర్ఎస్ లో ఇచ్చిన వాటికి కేవలం పత్రాలు అందించి మేము ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడం విడ్డురంగా ఉందన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పిన ఆయన ఇప్పటి వరకు చేయలేదన్నారు. రైతు బంధు, రైతు బీమా, మిషన్ కాకతీయ పథకాలతో గత ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమలు చేసి పంటల సాగు పెంచితే... అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు తీరని అన్యాయం చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు కన్నుమూత